యథేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జా!

- రూ.60 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం
- సేల్ డీడ్లు, నోటరీలుగా అమ్మకం
- దర్జాగా అక్రమ నిర్మాణాలు
- అక్రమార్కులతో అధికారుల కుమ్మక్కు
- ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికుల డిమాండ్
- విచారణ చేసి చర్యలు తీసుకుంటాం : గండిపేట తహసీల్దార్



ప్రభుత్వ భూమిలో వెలుస్తున్న ప్రహరీలు, గోదాంలు



కొనసాగుతున్న ప్రహరీల నిర్మాణాలు

మణికొండ: అది ప్రభుత్వ భూమి.. అందున అక్కడ గజం రూ. 80 వేల నుంచి లక్ష వరకు పలుకుతోంది. దీంతో ఆ భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. దీనికి అధికారుల సహకారం కూడా తోడుకావటంతో ఇంకేముంది ఇష్టారీతిన నోటరీల రూపంలో స్థలాలను అమ్మకాలు కూడా చేపట్టారు. అయితే ఏది ప్రభుత్వ భూమో.. ఏది లేఅవుట్ చేసిన ప్లాటో తెలియని పేద, మధ్య తరగతి ప్రజలు తక్కువ ధరలకే వస్తుందని కొనుగోలు చేసి నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. అలా కొనుగోలు చేసిన స్థలాలో గృహాలు, ప్రహరీలు, గదులు నిర్మాణాలు చేస్తున్నారు. కొన్నింటికి ఏకంగా మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకున్నట్టు సమాచారం. గతంలో పనిచేసిన రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి యథేచ్ఛగా ప్రభుత్వ భూమికి ఎసరు పెట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే... గండిపేట మండలం, పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 116 నుంచి 118, 136 నుంచి 143ల వరకు బయోడ్‌కాలనీ లేఅవుట్ చేశారు. దాని పక్కనే సర్వే నెంబర్ 146లో 15 గుంటలు, 147, 148లలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇవే ప్రభుత్వ సర్వే నెంబర్‌ల నుంచి పందెన్‌వాగు నాలా ప్రవహిస్తుంది. అప్పట్లో ప్రభుత్వ భూమిని వదిలి మిగతా పట్టా భూమిలో బయోడ్ కాలనీ లేఅవుట్ వేయటంతో అందులో అనేకమంది ప్లాట్లను కొనుగోలు చేసి గృహాలు, అపార్టుమెంట్లను నిర్మించుకున్నారు.

ప్రభుత్వ భూమిపై అక్రమార్కుల కన్ను...

బయోడ్‌కాలనీ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. బయోడ్ కాలనీ సర్వే నెంబర్‌లతోనే అప్పటి యజమానుల వారసులతో ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్‌లు చేసి అమ్మకాలు సాగించారు. తక్కువ ధరలో వస్తుండటం, అభివృద్ధి చెందిన కాలనీ కావటంతో అనేక మంది కొనుగోలు చేశారు. దీంతో అక్రమార్కులు అప్పనంగా కోట్ల రూపాయలను దండుకున్నారు. అందులో అప్పటి రెవెన్యూ అధికారులకు వాటాలు ఇవ్వటంతో వారు మిన్నకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాంతో అక్రమార్కుల ఆగడాలు జోరుగా సాగాయని కాలనీవాసులు పేర్కొన్నారు. ఇదే తరహాలో నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 20లోనూ ఉన్న ప్రభుత్వ భూమిని అమ్మకాలు చేపట్టారు. అక్కడా నిర్మాణాలు కూడా వెలుస్తున్నాయి. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉండటంతో మున్సిపాలిటీ వారు భూమి వివరాలను పట్టించుకోకుండా నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. అంతేకాకుండా వెంకటేశ్వర కాలనీలోని పార్కు స్థలాలను ఇష్టారాజ్యంగా అమ్మకాలు చేయటంతో వాటిల్లో నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఈ విషయం గతంలో 'సాక్షి' దినపత్రిక ప్రముఖంగా ప్రచురించటంతో కొన్నిపార్కులతో పాటు సర్వే నెంబర్ 20లోని కొంత ప్రభుత్వ భూమిని అప్పటి ఆర్‌డీఓ చంద్రకళ పరిరక్షించారని ఆ కాలనీ వాసులు తెలిపారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను గత ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసేందుకు జీవో 58, 59లు తేవటంతో బయోడ్‌కాలనీ పక్కన ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసిన పలువురు విషయం తెలుసుకుని రెగ్యులరైజేషన్‌కు పెట్టుకున్నట్టు తెలిసింది. ప్రధాన రోడ్డుకు ఉన్న ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా షాపులు నిర్మించుకుని మున్సిపాలిటీకి పన్నులు చెల్లించి, విద్యుత్ మీటర్లు తీసుకుని మరీ క్రమబద్ధీకరణకు పెట్టుకున్నట్టు సమాచారం. గతంలో పలుమార్లు రెవెన్యూ అధికారులు ఇక్కడ వెలిసిన షాపులను తొలగించారు. తిరిగి అక్కడే నిర్మించుకుని ఈసారి క్రమబద్ధీకరణకు పెట్టుకున్నట్టు తెలిసింది. ఇలాంటి ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకే ప్రజలు చెల్లించే పన్నుల నుంచి జీతాలు తీసుకుంటున్న అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూడటంతో పాటు అక్రమార్కులతోనే చేతులు కలిపి వారికి అండదండలు అందిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ శశాంక, రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డిలు స్పందించి ప్రభుత్వ భూమిలో వెలసిన నిర్మాణాలను తొలగించి పరిరక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే చర్యలు తీసుకుంటాం



సర్వేనెంబర్ 146, 144లలోని ప్రభుత్వ భూమిలో వెలిసిన నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకుంటాం. అందులో కొందరు క్రమబద్ధీకరణకు దరఖాస్తులు పెట్టుకున్నారు. వాటి వివరాలను పరిశీలించి క్రమబద్ధీకరణ కానివి, ఆక్రమణలో ఉన్న వాటిపై చర్యలు చేపడతాం. ఇప్పటికే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లకు ప్రతి ప్లాట్ వారి వివరాలను తీసుకుని, ప్రభుత్వ భూమిని గుర్తించి, నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టామని ఆదేశించాను.

ఎస్. శ్రీనివాస్‌రెడ్డి
(తహసీల్దార్, గండిపేట మండలం)



అలకాపూర్-అలిజాపూర్‌లో ప్రభుత్వ భూమిలో వెలసిన షాపులు



ప్రభుత్వ భూమిలో పూర్తి చేసుకున్న ప్రహరీ నిర్మాణం



పందెన్‌వాగు బఫర్ జోన్‌లో వెలసిన ప్రహరీ

అక్రమ నిర్మాణాల అంతు తేలుస్తాం

- మణికొండ, నార్సింగి మున్సిపల్ కమిషనర్లు
- మొదలైన కూల్చివేతల పర్వం



కోకాపేటలో అదనపు అంతస్తులను కూల్చి వేయిస్తున్న అధికారులు

మణికొండ: మున్సిపాలిటీల పరిధిలో తీసుకున్న అనుమతులకు భిన్నంగా ఇష్టారాజ్యగా, అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న నిర్మాణాల అంతు తేలుస్తామని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌లు పేర్కొన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట 250 గజాల లేఅవుట్‌లో హెచ్‌ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి నిర్మాణంలో ఉన్న అదనపు అంతస్తుల నాలుగు భవనాల స్లాబులను కూల్చివేశారు. మణికొండ మున్సిపాలిటీ అలకాపూర్‌టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 29లో నిర్మాణంలో ఉన్న మూడు భవనాలను మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్లు మాట్లాడుతూ మున్సిపాలిటీలలో తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అదనంగా అంతస్తులు వేయాలంటే హెచ్‌ఎండీఏ నుంచి టీడీఆర్‌లు కొనుగోలు చేసి నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలను తప్పనిసరి కూల్చివేస్తామన్నారు. కోకాపేటలో జీ ప్లస్ రెండు అంతస్తులకే అనుమతులు తీసుకుని ఏకంగా ఏడు, ఎనిమిది అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయన్నారు. అలాంటి వాటికి నోటీసులు జారీ చేయటంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో వెలసిన అక్రమ నిర్మాణాలన్నింటిపై హెచ్‌ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చర్యలు తీసుకోవాలని లేఖ రాశామన్నారు. తమ లేఖకు స్పందించి వారు కూల్చివేతలు మొదలు పెట్టారని నార్సింగి కమిషనర్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లోను కూల్చివేతలు కొనసాగుతాయని ఇద్దరు కమిషనర్‌లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో నార్సింగి టౌన్‌ప్లానింగ్ అధికారి మణిచందన, ఆర్ఐ మోహన్‌రావు, హెచ్‌ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై సంతోష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



మణికొండలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న టీపీఓ సంతోష్‌సింగ్

రాష్ట్ర స్విమ్మింగ్ పోటీల్లో గంగిడి పుల్లారెడ్డి సత్తా

అత్తాపూర్: సికింద్రాబాద్ మున్సిపల్ (వీవీ గురుమూర్తి మెమోరియల్)లో గురువారం పాన్ ఇండియా గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ బస్తీకి చెందిన గంగిడి పుల్లారెడ్డి (52) 400 మీటర్ల స్విమ్మింగ్ ఈవెంట్‌లో మొదటి స్థానంలో నిలిచి సత్తా చాటారు. స్విమ్మింగ్ ఫ్రీ స్టైల్ 200 మీటర్ల పోటీలో రెండోస్థానంలో నిలవగా, బటర్‌ఫ్లై పోటీలతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. పోటీలు ముగిసిన అనంతరం విజేతగా నిలిచిన గంగిడి పుల్లారెడ్డికి పాన్ ఇండియా గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు బహుమతి, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ గంగిడి పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల విద్యార్థి స్థాయి నుంచి స్విమ్ చేయడం అలవాటుగా చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులది కూడా అని సూచించారు. చిన్ననాటి నుంచే పిల్లలకు స్విమ్మింగ్ తప్పక తప్పక అలవాటు చేయించాలని కోరారు. గత 30 సంవత్సరాలుగా సరదాగా ప్రారంభించిన స్విమ్మింగ్ ప్రతిరోజు స్విమ్ చేస్తూ దేశంలో స్విమ్మింగ్ పోటీలు ఎక్కడ జరిగిన పోటీలలో పాల్గొంటూ బహుమతులు తీసుకురావడం జరుగుతుందని సాక్షికి వివరించారు. సర్వరోగ నివారిణిగా సహకరించడంతో పాటు శారీర దృఢత్వానికి మనము అనుకున్న సంకల్పానికి దగ్గరగా చేస్తుందని పుల్లారెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు స్విమ్మింగ్ నేర్పించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని ఈ మేరకు క్రీడారంగంలో మంచి ప్రావీణ్యం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని త్వరలో కలుస్తామని ఈ సందర్భంగా వివరించారు.



గంగిడి పుల్లారెడ్డికి మెడల్స్, సర్టిఫికెట్ అందజేస్తున్న పాన్ ఇండియా ప్రతినిధులు

నేడు బండ్లగూడజాగీరు కార్పొరేషన్ మేయర్ ఎన్నిక

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతన మేయర్‌ను ఎన్నిక నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసి మేయర్‌ను ఎన్నుకోనున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ కార్పొరేటర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్‌ను ఎన్నుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మొదటి మేయర్‌గా బుర్ర మహేందర్‌గౌడ్ ఉన్న సమయంలో ఆయన ఒంటెద్దుపోకడలు నచ్చక 16 మంది కార్పొరేటర్లు ఒక్కటై జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానంపై లేఖను సమర్పించారు. దీంతో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేసన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర మార్చి 21వ తేదీన బలనిరూపణ చేపట్టగా అవిశ్వాసంలో నెగ్గిన కార్పొరేటర్లు మేయర్‌ను గద్దెదించారు. గురువారం మేయర్ ఎన్నికను ఆపాలని కోరుతూ మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్‌లు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ వేసి మేయర్ ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు. కానీ జడ్జి వీరి పిటిషన్‌ను తిరస్కరించడంతో మేయర్ ఎన్నికకు రూట్ క్లియర్ అయింది.

అల్లరి మూకలకు అడ్డాగా శంషాబాద్ ఫ్లైఓవర్



మూత్ర విసర్జనలతో కంపుగా మారిన ఫ్లైఓవర్ కింది భాగం

- మత్తులో జోగుతున్న గంజాయి, మందుబాబులు
- ఒకవైపు అసాంఘిక కార్యకలాపాలు, మరోవైపు మూరికికూపం, అక్రమ పార్కింగ్
- అటుగా వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు
- నిత్యం గొడవలతో భయాందోళన చుట్టుపక్కన దుకాణాదారులు
- అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

శంషాబాద్: అక్కడ గంజాయి మూకలు.. మందుబాబులు నిత్యం జోగుతుంటారు.. ఇంకాస్త ముందుకెళితే ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్‌లు కనిపిస్తాయి. మరికొంచెం ముందుకెళ్తే బహిరంగ మూత్ర విసర్జనలతో ముక్కు మూసుకోవాల్సిందేననే రీతిలో అక్కడ ప్రదేశాలు అస్తవ్యస్తంగా మారాయి. పట్టణంలోని ఫ్లై ఓవర్ కింద ఒక్కో పిల్లర్ కింద ఒక్కో విధంగా ఉన్న దుస్థితి చూస్తే పట్టణానికి కొత్తగా విచ్చేసిన వారు ముక్కుమీద వేలేసుకోవాల్సిన అధ్వానంగా మారింది శంషాబాద్ ఫ్లైఓవర్ కింది భాగం.

ఎందుకిలా..?

2019 ప్రారంభమైన శంషాబాద్ ఫ్లైఓవర్ పనులు ఏడాది కిందట రాకపోకలు ప్రారంభమయ్యాయి. ట్రంపెట్ బ్రిడ్జి నుంచి వచ్చే రహదారిని అనుసంధానం చేయకపోవడంతో ఓవర్ కింది భాగాన్ని ఎన్‌హెచ్‌ఏ అధికారులు గాలికొదిలేశారు. ఇందులో సుందరీకరణ చేపట్టాల్సి ఉండగా ఇంకా ఆ దిశగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ నుంచి ప్యారడైజ్ హోటల్ వరకు ఫ్లై ఓవర్ కింది భాగంలో అత్యంత దుస్థితి నెలకొంది..

మత్తులో..

ఆర్‌జీఐఏ పీఎస్‌కు కొద్ది దూరంలో దు పిల్లర్ల వద్ద గంజాయి సేవించే వారితో పాటు మందుబాబులు తిష్ట వేసి అక్కడ పేకాట వంటివి ఆడుతూ నిత్యం గొడవపడుతుంటారు. వీరి గొడవల కారణంగా ఇటీవల ఓ వస్త్రదుకాణం అద్దం సైతం పగిలిపోయింది. గొడవల్లో వీరు చేసే హంగామాతో స్థానికంగా దుకాణదారులు నిత్యం భయపడుతున్నారు. ఇక సాయంత్రం అయితే చాలు ఫ్లైఓవర్‌కు ఎదురుగా ఉన్న హోటల్ వద్దకు చేరుకునే అల్లరి మూకలు సైతం ఇక్కడే వాహనాలు పార్కింగ్ చేయడంతో పాటు తరచూ వాగ్వాదాలకు దిగుతున్నారు. ఇటీవల ఇద్దరు వ్యక్తులు పార్కింగ్ విషయంలో గొడవ పడితే మధ్యలో వెళ్లి సముదాయించే ప్రయత్నం చేసిన పాపానికి అతడి తలపై రా డ్డుతో కొట్టిన సంఘటన కూడా ఉంది.



ఫ్లైఓవర్ కింద అడ్డగోలుగా పార్కింగ్ చేసిన వాహనాలు

వాహనాల చోరీలు.

ఫ్లై ఓవర్ కింద ఇష్టారాజ్యంగా చేస్తున్న వాహనాల పార్కింగ్ కాస్తా చోరులకు మేలు చేసేదిగా మారుతోంది. ఇప్పటికే పలు ద్విచక్ర వాహనాలు చోరీకి గురవడంతో పాటు ఓ ఆటో కూడా మాయమైందని బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

మూరికి కూపంగా..

ఫ్లైఓవర్ కింది భాగం ఇప్పుడు బహిరంగ మూత్ర విసర్జనలకు అడ్డాగా మారింది. దీంతో రోడ్డుపై ప్రయాణించే వారు సైతం ఈ ప్రాంతానికి వచ్చేసరికి ముక్కుమూసుకోవాల్సిన దుస్థితిగా మారింది. అస్తవ్యస్తంగా మారుతున్న పారిశుద్ధ్యం తీరును మున్సిపాలిటీ అధికారులు కూడా గాలికొదిలేశారు.

ప్రత్యామ్నాయం లేక..

ఆటో, ట్యాక్సీ స్టాండ్‌లు లేకపోవడంతో కొందరు వాహనదారులు కూడా ఇక్కడే తిష్టవేస్తున్నారు. వీరు తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పోలీసులు, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది. ఫ్లైఓవర్ పనులు చేపడుతున్న ఎన్‌హెచ్‌ఏ అధికారులు కూడా త్వరగా పనులు పూర్తి చేసి సుందరీకరణ పనులు చేపడితే ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు వీలుండదని శంషాబాద్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. నందిముస్లాయిగూడ యుజీ ఫీడర్ పరిధిలోని అత్తాపూర్ విలేజ్, సీబీఐటీ కాలనీ, సోమిరెడ్డినగర్, ఏషియన్ థియేటర్, పటేల్ హోట్, వీకర్ సెక్షన్ కాలనీ ప్రాంతాల్లో ఉదంయ 11 గంటల నుంచి 1 గంటల వరకు, అత్తాపూర్ ఫీడర్ పరిధిలోని ఈశ్వర్ థియేటర్, హైదర్‌గూడ విలేజ్, గాంధీ విగ్రహం, కంటారెడ్డినగర్, రాధాకృష్ణనగర్, అంబియన్స్ ఫోర్ట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 గంటల నుంచి 3 గంటల వరకు, జనప్రియ ఏబీ కేబుల్ ఫీడర్ పరిధిలోని కేశవ్‌నగర్, కృష్ణానగర్, శివనగర్, మోర్ సూపర్ మార్కెట్, గుమ్మకొండ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆదర్శ్ కాలనీ ఫీడర్ పరిధిలోని ఆదర్శ్‌నగర్ విలేజ్, మంజు బార్, ఆరాంఘర్ పిస్తాహౌజ్, కింగ్స్ శరణ్య, లక్ష్మీ నారాయణ విల్లాస్, మెట్రో కన్వర్షన్ ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు, డ్రీమ్ వల్లే మిక్స్‌డ్ ఫీడర్ పరిధిలోని నిజార్ ఫంక్షన్, ఆరాంగర్ (పోలీస్ స్టేషన్ గల్లీ) ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 గంటల నుంచి 2.30 గంటల వరకు, భవానీ కాలనీ ఫీడర్ పరిధిలోని భవానీ కాలనీ, ప్రేమావతిపేట్, పిల్లర్ నంబర్ 285 ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మణికొండ: కోకాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగించటం, ఫీడర్ మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నామని ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు. దీంతో కోకాపేట గ్రామం, ఇందిరమ్మ కాలనీ, ఈడెన్ విల్లాస్, పౌలోమి అట్రియా, ఫోనిక్స్ గ్లోబల్ స్కూల్, 60 గజాల కాలనీ, శివాలయం ఏరియా, నార్త్‌స్టార్ విల్లాస్, బస్తీ దవాఖానా ప్రాంతాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామన్నారు. శ్రీకృష్ణ గోశాల, మైహోం తర్క్య ఫీడర్‌ల పరిధిలో ఎన్‌సీసీ అర్బన్, సెవన్ హిల్స్, అలేఖ్య హోంమ్స్, ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్డు, రాంకీవన్ వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2గంటల వరకు, అక్షయ పాత్ర ఫీడర్ పరిధిలోని కోకాపేట స్కూల్, పైప్‌లైన్‌రోడ్డు, అక్షయ పాత్ర ఫౌండేషన్, ఓజీఎం రోడ్ వెర్టెక్స్ పనాచే ప్రాంతాలలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

రాజేంద్రనగర్‌లో మెజార్టీ సాధిస్తాం

మణికొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్



నరేందర్‌రెడ్డిని కలిసిన జితేందర్

మణికొండ: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మంచి మెజార్టీ సాధిస్తుందని మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం. జితేందర్ అన్నారు. గురువారం ఆయన రాష్ట ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పోలింగ్ బూత్ వారీగా పోలైన ఓట్లు, కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఓట్లపై పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కె.నరేందర్ ముదిరాజ్ నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తరఫున నియోజకవర్గంలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహించామని, ప్రభుత్వ ఆరు గ్యారంటీలను ఇంటింటికి వివరించి ఓటు అడిగామన్నారు. ప్రజల నుంచి మంచి స్పందన ఉందని, గతంలో కన్నా ఎక్కువగా పోలింగ్ జరిగిందని వివరించానని తెలిపారు.

జూ పార్క్‌లో మిల్లెట్స్ వైవిధ్య ప్రదర్శన

ఏజీవర్సిటీ: ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఐసీఏఆర్-ఐఐఎంఆర్ సంయుక్తంగా నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో మిల్లెట్స్ వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి ఐసీఏఆర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ హైదరాబాద్ ద్వారా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో మిల్లెట్స్ సాగు, ప్రాసెసింగ్ కోసం అభివృద్ధి చేసిన సాంకేతికతలు ప్రచురణలతో పాటు ప్రత్యక్ష నమూనాలు, మిల్లెట్స్ ఆధారిత ఉత్పత్తులను ప్రదర్శించారు. ఇందులో జూపార్క్‌కు వచ్చిన సందర్శకులకు మిల్లెట్స్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, పర్యావరణ ప్రయెజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఐఎంఆర్ తరఫున అసిస్టెంట్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్‌కుమార్, సి. తారా సత్యవతి, దయాకర్‌రావు, జూపార్క్ డిప్యూటీ క్యూరేటర్ నాగమణి, విద్యాధికారి దీపక్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.